


నేడు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్

పార్వతీపురం : స్థానిక కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రభుత్వ, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సేవలందిస్తున్న అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు తమ సర్వీసుకు సంబంధించిన ఫిర్యాదులు, పెండింగ్ విషయాలు, పెన్షన్ సమస్యలు, టెర్మినల్ బెనిఫిట్ క్లెయిమ్‌లు, పరిష్కారానికి సాధ్యమయ్యే ఇతర పరిపాలనా సమస్యలను విన్నవించడానికి ఒక ప్రత్యేక వేదికను అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని శాఖాధిపతులు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో సూచించిన సమయానికి హాజరు కావాలని, జిల్లా అధికారులు పెండింగ్‌లో ఉన్న సేవా సంబంధిత సమాచారంతో ఫిర్యాదుల కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

అరకొరగా ధాన్యం కొనుగోళ్లు

పొలంలోనే ఆరబెట్టిన ధాన్యం



- తరుముకొస్తున్న మరో తుపాను
- పూర్తి స్థాయిలో బ్యాంకు గ్యారంటీలివ్వని మిల్లర్లు
- కిరికిరి చేస్తున్న మిల్లు యజమానులు
- వ్యాపారుల నుంచి కొనుగోళ్లకే ప్రాధాన్యం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో అరకొర ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. రైతులు నూర్పులు చేసి అమ్మకానికి ధాన్యం సిద్ధంగా ఉంచారు. అయితే రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. పూర్తిస్థాయిలో కొనుగోళ్లు ప్రారంభంకాకపోవడంతో వ్యవసాయ సిబ్బంది ప్రక్రియలో భాగస్వాములు కాని పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో 2.5 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే చాలా మండలాల్లో ధాన్యం విక్రయానికి సిద్ధం ఉన్నప్పటికీ కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం కాలేదు. జిల్లాలోని మిల్లు యజమానులు కూడా ఇంకా పూర్తి స్థాయిలో బ్యాంక్ గ్యారంటీ లిచ్చిన దాఖలాల్లేవు. ఇంతవరకు 54 మిల్లుల నుంచి రూ.26 కోట్లు బ్యాంక్ గ్యారంటీ రూపంలో వసూలైంది. మరో 53 మిల్లుల నుంచి రూ.40 కోట్ల దాకా అందాల్సి ఉంది. దీంతో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయలేదు. ఫలితంగా రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలు తుఫాన్ల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతును మళ్లీ మరో తుపాను వెంటాడుతున్న పరిస్థితి ఏర్పడింది. ఈ నెలాఖరులోగా మరో తుఫాన్ వుంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడంతో రైతులు అప్రమత్తమయ్యారు. వరి పంట చేతికొచ్చే సమయంలో మరో తుపాను వస్తుందని తెలియడంతో ఆందోళనకు గురవుతున్నారు. తుపాను వచ్చేలోగా నూర్పులు చేసి ధాన్యం అమ్మేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో కల్లాల్లో ధాన్యం బస్తాలతో సిద్ధంగా ఉన్నారు. అయితే రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది మాత్రం కొనుగోలు ప్రక్రియను పూర్తి స్థాయిలో చేపట్టడం లేదు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను కూడా పూర్తిగా అందుబాటులోకి తీసుకురాలేదు. ఫలితంగా నూర్పులు చేసిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కొన్ని మండలాల్లో మిల్లు యజమానులు వ్యాపారుల నుంచి ధాన్యం సేకరణకే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారులతో మిల్లు యజమానులకు వున్న అవగాహన మేరకు వారు రవాణా చేసిన ధాన్యం లోడులకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సీతానగరం మండలంలో కొంతమంది మిల్లర్లు ఈ కిరికిరి చేస్తున్నట్లు తెలుస్తోంది. తుఫాన్ వస్తుందేమోనన్న భయంతో కొంతమంది రైతులు నిల్వ చేసుకునే సామర్థ్యం లేక వ్యాపారులకు అమ్మకానికే సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా మిల్లు యజమానులకు కూడా రోజుకు 2వేల బస్తాల వరకే సేకరణ చేపట్టాలని ఆంక్షలు విధించడంతో వారు వ్యాపారులకు ప్రాధాన్యత ఇస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

7688 టన్నుల సేకరణ

శ్రీనివాసరావు, డిఎం సివిల్ సప్లయ్ కార్పొరేషన్

జిల్లాలో ఇంతవరకు 73కొనుగోలు కేంద్రాల్లో 7866 టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. మొత్తం 181 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తాం. ఇంకా పూర్తి స్థాయిలో ధాన్యం నూర్పులు జరగలేదు. ధాన్యం రవాణాకు 1300 వాహనాలను సిద్ధం చేశాం.



సబ్‌కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న వామపక్ష నాయకులు

ఆదర్శంగా నిలవాల్సిన డాక్టర్ అడ్డదారులు తొక్కుతారా?

సబ్ కలెక్టర్‌కు మరోసారి ఫిర్యాదు చేసిన ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణ నడిబొడ్డున ఉన్న వరహాలగెడ్డ స్థలానికి పట్టణానికి చెందిన డాక్టర్ డి.రామ్మోనరావు మరోసారి కంచె నిర్మించడంపై వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు గురువారం మళ్లీ సబ్ కలెక్టర్ వైశాలిని కలిసి వినతిపత్రం అందజేశాయి. ఇప్పటికే అనేక ఆందోళనలు చేపట్టడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి వరహాలగెడ్డ ఆక్రమణలపై చర్యలు చేపట్టారు. అందులో భాగంగా సర్వేనెంబర్ 410లో కొంత భాగాన్ని ఆక్రమణగా గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ట్రెంచ్ ఏర్పాటు చేసింది. ఈ ప్రభుత్వ స్థలంలో కొంతమంది వ్యక్తులు కంచె నిర్మించి స్వాధీనం చేసుకోవడాన్నిగమనించిన వామపక్ష ప్రజాసంఘాల నాయకులు బుధవారం కంచెను తొలగించారు. దీనికి ప్రతిగా తొలగించిన కంచె స్థానంలో మళ్లీ డాక్టర్ మనుషులు కంచె ఏర్పాటు చేయడం, ప్రభుత్వ స్థలంలో మొక్కలు నాటడం పట్ల వామపక్ష ప్రజా సంఘాల నాయకులు తీవ్ర అభ్యంతర వ్యక్తం చేశారు. ఒక పక్క ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ప్రయత్నిస్తుంటే ఆ సంకల్పాన్ని దెబ్బతీసేలా డాక్టర్ రామ్మోహన్‌రావు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికే మొక్కలు నాటే పేరుతో వరహాలుగెడ్డ స్థలాన్ని ఆక్రమించి కర్షక మహర్షి ఆసుపత్రి భవన నిర్మాణాలు చేపట్టినట్టు ప్రజలు భావిస్తున్నారని సంఘాల నాయకులు ఆరోపించారు. అదే పద్ధతిలో ఇప్పుడు ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిలో మొక్కలు నాటే ప్రయత్నం చేసి ఆక్రమణకు సిద్ధపడుతున్నట్లు అనుమానం కలుగుతుందని తెలిపారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన డాక్టర్ ఇలా భూ ఆక్రమణలకు పాల్ప డడం, అక్రమార్కులకు తోడ్పడేలా వ్యవహరించడం సమంజసం కాదని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు కొల్లి గంగునాయుడు, ఆర్‌విఎస్ కుమార్, పోల ఈశ్వరరావు, టి జీవ, పి రంజిత్ కుమార్ తదితరులు విమర్శించారు. వరహాల గెడ్డ ఆక్రమణల నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూముల్లో రామ్మోహన్‌రావు కంచె నిర్మాణం, మొక్కలు నాటడం, కర్షక మహర్షి ఆసుపత్రి భవన నిర్మాణాలు తదితర అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, ఆక్రమణలు తొలగించాలని గురువారం సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, రైతు కూలీ సంఘం, గిరిజన సంక్షేమ సంఘంలి తదితర సంఘాల ప్రతినిధులు సబ్ కలెక్టర్ వైశాలిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే వరహాలగెడ్డ ఆక్రమణలపై కింది స్థాయి సిబ్బందిని నియమించి దర్యాప్తు చేపడుతున్నామని, ఆక్రమణదారులందరికీ నోటీసులు పంపించి వివరణ కోరుతున్నామని, సబ్ రిజిస్ట్రార్ నుంచి వివరణ కోరామని తెలిపారు. ఈ విషయంలో కూడా చర్యలు చేపడతామని ప్రభుత్వ స్థలంగా గుర్తించిన స్థలంలో ప్రభుత్వమే శాశ్వత కంచెను ఏర్పాటు చేసి స్థలాన్ని రక్షించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వామపక్ష ప్రజాసంఘాల నాయకులు గొర్లి వెంకటరమణ, బివి రమణ, కె.రామస్వామి, పి.సంఘం, సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.


తోటపల్లి ఐటిడిఎ పార్కు పునప్రారంభం

బోట్ రైడింగ్, ఫొటో, వీడియో షూట్లకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి,కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఐటిడిఎ ఆధ్వర్యంలో పునరుద్ధరించబడిన తోటపల్లి పార్కు గురువారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించే లక్ష్యంతో ఈ పార్కును కొత్తదనం ఉట్టిపడేలా, అన్ని హంగులతో దీన్ని పునరుద్ధరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి, జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి పార్కును లాంఛనంగా ప్రారంభించారు. ఐటిడిఎ కృషిని అభినందించారు. పార్కు పునరుద్ధరణ పనులను ఎప్పటికప్పుడు జెసి పర్యవేక్షించి, స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథులతో పాటు, జిల్లా అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, పార్కు విశేషాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ అనివార్యకారణాల వల్ల నిలిచిపోయిన బోట్ రైడింగ్ సదుపాయాన్ని గురువారం నుంచి పునః ప్రారంభించామన్నారు. సందర్శకులు



పార్కును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి, కలెక్టర్ ప్రభాకరరెడ్డి, పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

తోటపల్లి బ్యారేజీ అందాలను వీక్షించడానికి, సెల్ఫీలు తీసుకోవడానికి వీలుగా ప్రత్యేకమైన వ్యూ పాయింట్లు, సెల్ఫీ స్పాట్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పార్కును అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడమే కాకుండా ఫుడ్, డ్రింక్స్, వాటర్ వంటి ప్రాథమిక అవసరాల కోసం కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. ప్రీ వెడ్డింగ్ లేదా పిల్లల ఫోటో షూట్‌లు, ఇతర శుభ కార్యక్రమాల కోసం ఇక్కడే ఫోటోగ్రాఫర్, అవసరమైన ఎక్విప్‌మెంట్‌ను అందుబాటులో ఉంచామన్నారు. బోట్ రైడింగ్, ఫోటో షూట్ సదుపాయాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తోటపల్లి బ్యారేజ్ అందాలను తిలకించడానికి ఈ పార్కు ఒక చక్కటి గమ్యస్థానం అని వారు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పిఎపై ఎస్‌పికి ఫిర్యాదు

విచారణ జరిపించాలని మహిళా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రగిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి పిఎ సతీష్ బాధితురాలు గురువారం జిల్లా ఎస్‌పి ఎన్ వి మాధవరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి, ఉపాధ్యక్షులు గౌరి, శ్రామిక మహిళా కన్వీనర్ బి.రాధ ఆధ్వర్యాన బాధిత మహిళ ఫిర్యాదు చేశారు. మంత్రి అనధికార పిఎ సతీష్ నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరారు. తనకు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి పిఎ సతీష్ రూ.5 లక్షలు తీసుకున్నారని చెప్పారు. ఉద్యోగం వచ్చిన తర్వాత విచారించగా డబ్బులు అధికారులకు ఇవ్వలేదని తేలిందని చెప్పారు. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయగా తన బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి నాయకులతో గడపాలని ఒత్తిడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధిత మహిళకి న్యాయం చేయాలని మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

30లోగా అర్హులైన గృహ లబ్ధిదారులు నమోదు చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణం) 2.0 పథకం కింద అర్హులైన మిగిలిపోయిన గృహ నిర్మాణ లబ్దిదారులు వెంటనే మీ గ్రామ పంచాయితీలోని సర్వే బందాన్ని కలిసి నమోదు చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో సర్వే ఈనెల 10న ప్రారంభించామన్నారు. ఎంపిడిఒ, హౌసింగ్ ఎఇల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సిబ్బందితో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక సర్వే బృందం ఏర్పాటు చేసి గత 17 రోజులుగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్వతీపురం, పాలకొండ, సాలూరు మున్సిపాలిటీలు, కురుపాం మినహా అన్ని గ్రామాల్లో లబ్దిదారులు ఎంపిక జరుగుతుందని అన్నారు. ఈనెల గురువారం నాటికి జిల్లాలో 23,151 మంది లబ్దిదారులకు ఎంపికచేయడమైందని, ఎంపిక గడువు ఈనెల 30తో ముగుస్తున్నందున మిగిలిపోయిన లబ్దిదారులు అర్హులై ఉన్నట్లయితే వెంటనే మీ గ్రామ పంచాయితీలో నమోదు చేసే సర్వే బృందాన్ని కలిసి నమోదు చేయించుకోవాలని కలెక్టర్ కోరారు.

ఉత్సాహంగా 'రైతన్నా మీకోసం : జెసి

ప్రజాశక్తి - బలిజిపేట

రైతన్నా -మీ కోసం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సి యస్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. వ్యవసాయ అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రైతుల సమస్యలు తెలుసుకోవడానికి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమని అన్నారు. మండలంలోని పెద్దింపేటలో గురువారం ఆయన పర్యటించారు. పంట పరిస్థితులు, భూమి స్వరూపం, సాగు విధానాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, నీటి అవసరాలపై రైతుల నుండి నేరుగా సమాచారం సేకరిస్తున్నట్టు తెలిపారు. రైతుల సమస్యలను పూర్తిగా అర్థం చేసుకోవడం, వారిని ఆదాయం పెంచుకునే దిశగా మార్గనిర్దేశం చేయడమే ఈ క్యాంపైన్ ప్రధాన లక్ష్యమన్నారు. రాబోయే పంట సీజన్లకు అవసరమైన వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, విత్తనాలు, ఎరువులు, నీటి ప్రణాళికలు, పంట రకాలకు సంబంధించిన ముందస్తు అనుసంధాన చర్యలకు ఇది దోహదం చేస్తుందన్నారు. రైతుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా యంత్రాలపై సబ్సిడీలు, పంట ప్రోత్సాహక పథకాలు, ఆధునిక సాగు విధానాల అమలు, అధిక దిగుబడి - తక్కువ ఖర్చుతో సాగు సాధించేందుకు జిల్లా వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రణాళికలను అమలు చేయనుందన్నారు. వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చడానికి లక్ష్య ఆధారిత ప్రణాళికలు సిద్ధం చేయడానికి ఈ సమాచారం ఉపయోగకరమని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెంచాలి

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెంచాలని జెసి యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.



రైతులతో మాట్లాడుతున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మెరుగుపర్చే లక్ష్యంతో ఆయన ఈ తనిఖీ నిర్వహించారు. తొలుత వైద్యులు, నర్సులు ఇతర పారామెడికల్ సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. సమయపాలన పాటించని సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు, టీకాలు తగినంతగా అందుబాటులో ఉన్నాయా లేదా అని డ్రగ్ స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. సంస్థాగత ప్రసవాలను ప్రోత్సహించాలని, బలిజిపేట వైద్య సిబ్బందికి సూచించారు. పిహెచ్‌సి పరిసరాలను, వార్డులను, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. పిహెచ్‌సికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన సేవలందించడం తమ ప్రాథమిక బాధ్యత అని గుర్తు చేశారు. ప్రభుత్వాసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెంచేలా సిబ్బంది కృషి చేయాలని జెసి ఆదేశించారు.

బిఎల్‌ఒలకు శిక్షణ

సీతంపేట : పాలకొండ నియోజకవర్గంలోని సీతంపేట, భామిని మండలాల బిఎల్‌ఒలతో గురువారం పాలకొండ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి పవార్ స్వప్నిల్ ఆధ్వర్యంలో స్థానిక ఐటిడిఎలో శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ రూపొందించిన నూతన నిబంధనల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఏ విధంగా చేపట్టాలి, పాటించాల్సిన నిబంధనలపై రిటర్నింగ్ అధికారి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీతంపేట, భామిని తహశీల్దార్లు శ్రీకన్య, శివన్నారాయణ, బిఎల్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

టెలిస్కోప్‌తో చంద్రుడిని ముద్దాడిన పిల్లలు

ప్రజాశక్తి - పార్వతీపురం


మన్యం పుస్తక మహోత్సవంలో భాగంగా మూడోరోజు గురువారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక, సాహితీ కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. స్థానిక స్టేట్ బ్యాంక్ అధికారి కుమార్తె మనస్వి చేసిన భారత్ నాట్యం అలరించింది. అదేవిధంగా దీపాంసిక, సితార, హర్షిణి చేసిన నృత్య ప్రదర్శన పలువుర్ని ఆకర్షించింది. సాహితీ కార్యక్రమంలో భాగంగా వర్ధమాన రచయిత మల్లిపురం జగదీష్ రచించిన మన్యం ముచ్చట్లు పుస్తకం గురించి ఉపాధ్యాయుడు, చిత్రకారుడు చందనపల్లి గోపాలరావు విశ్లేషణ చేశారు. కళింగాంధ్ర గిరిజన సాహిత్యం గురించి పొందూరు సుధాకుమార్ చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. సాహితీ, సాంస్కృతిక కార్యక్రమానికి గంటేడ చిన్నం నాయుడు అధ్యక్షత వహించారు. కవి, రచయిత గంటేడ గౌరునాయుడు, నిర్వాహక కమిటీ సభ్యులు ఎస్.మురళీమోహన్, కె.భాస్కరరావు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న టెలిస్కోప్

పుస్తక మహోత్సవంలో భాగంగా శుక్రవారం వైజాగ్ ఆస్ట్రానమీ క్లబ్ సభ్యులు నిర్వహించిన టెలిస్కోప్ కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. టెలిస్కోప్‌లో చంద్రుడ్ని ముద్దాడిన చందంగా తిలకించిన విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఎక్కువ గా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



టెలిస్కోప్ ద్వారా చంద్రుడిని చూస్తున్న విద్యార్థులు

నేడు వెయ్యి మందితో 'పాడుదుమా స్వేచ్ఛా గీతం'

ఉత్తరాంధ్రకు గర్వకారణమైన ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు మాస్టారు రచించిన "పాడుదమా స్వేచ్ఛా గీతం" దేశభక్తిని రగిలించే గీతాన్ని శుక్రవారం వేయిమంది విద్యార్థులు ఒకేసారి ఆలాపన చేయనున్నారు. ఇప్పటికే మహారాష్ట్ర పాఠశాలల్లో తొమ్మిదో తరగతి తెలుగు వాచకం కుమార భారతిలో ఈ గీతాన్ని పాఠ్యాంశంగా చేర్చిన గౌరవం దక్కింది. ఏలూరులో జరిగిన బాలోత్సవంలో వెయ్యి మందికి పైగా విద్యార్థులు సామూహికంగా ఆలపించగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయ్యింది. దేశవ్యాప్తంగా పేరు సంపాదించిన ఈ గీతం పుట్టినిల్లు పార్వతీపురం కావడం ఈ ప్రాంత వాసులకు గర్వకారణం. శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న మన్యం పుస్తక మహోత్సవ వేదికపై వెయ్యిమంది విద్యార్థినీ విద్యార్థులతో ఈ గీతాన్ని మరోసారి సామూహికంగా గానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.



నేత్ర పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

పాత్రికేయుల సంక్షేమానికి కృషి : కలెక్టర్

మీడియా సిబ్బంది, కుటుంబాలకు ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలో పని చేసే ప్రింట్, ఎలక్ట్రానిక్ పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో పాత్రికేయులకు ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాత్రికేయులు నిరంతరం పని ఒత్తిడితో ఉంటారని, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలని సూచించారు. అందుకే పాత్రికేయులు వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నిపుణులైన కంటి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా, ప్రజలకు నిరంతరం సమాచారం అందించే మీడియా సిబ్బంది, పరిపాలనలో భాగమైన కలెక్టరేట్ కుటుంబాల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

రైతు సేవా కేంద్రాల ద్వారా తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు డిమాండ్ చేశారు. మండలంలోని రెడ్డివానివలస, రామవరం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వరి కోతలు పూర్తి చేసి ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలు తెరిచినప్పటికీ మరికొన్నిచోట్ల కేంద్రాలు ప్రారంభించలేదన్నారు. రైతులకు గోనె సంచులు ఎక్కడా పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. కొనుగోలు కేంద్రం లేక దళారులకు అతి తక్కువ ధరకు వంద కేజీల బస్తా రూ.1400 నుంచి రూ.1700కు అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. దీంతో రైతుకు పెట్టుబడి కూడా రావడం లేదన్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.2369గా ప్రభుత్వం ప్రకటించిందని, అందుకు అనుగుణంగా ఎక్కడా ధాన్యం కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. దీనిపై ఇటీవల తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన సందర్భంగా రైతుల వద్ద నిల్వలు ఉన్న ధాన్యం కొనుగోలు చేస్తామని ఎఒ హామీ ఇచ్చారని అన్నారు. అంతేకాకుండా రైతులు లారీలు ఏర్పాటు చేసుకుంటే వెంటనే ధాన్యం తరలిస్తామని చెప్పారని అన్నారు. దీంతో గత రెండు రోజులుగా లారీల కోసం రైతులు ఎదురు చూస్తున్నప్పటికీ లారీలు మాత్రం రాలేదు. దీంతో గురువారం రామవరం రైతు సేవా కేంద్రం వద్దకు ఎపి రైతు సంఘం వెళ్లగా ఆ కేంద్రాల వద్ద వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఎవరూ లేరని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించే పంటను అమ్ముకునేందుకు ఇన్ని పాట్లు పడుతున్నప్పటికీ అధికారుల్లో చలనం లేదని, వెంటనే ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో ఎన్ని రైస్ మిల్లులు ఉన్నాయో వాటిన్నింటిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి బీజీలు తీయించి రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఈ విషయంపై జాయింట్ కలెక్టర్, సివిల్ సప్లై డిఎం దృష్టి పెట్టి తక్షణమే రైతుల వద్దనున్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు కోరారు. తుఫాను వస్తుందన్న భయంతో రైతులు ఆందోళనలో ఉన్నారని, కావున తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, రైతులు రెడ్డి తిరుపతిరావు, రెడ్డి రమణమూర్తి, ఆర్ ఈశ్వరరావు, సత్యనారాయణ రైతులు పాల్గొన్నారు.

తెరుచుకోని రైతు సేవా కేంద్రం



రామవరంలో తెరుచుకోని రైతు సేవా కేంద్రం వద్ద రైతు సంఘం నాయకులు

బట్టిలో పడి హెల్త్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పాంచాలి సమీపంలో పామాయిల్ కాటా దగ్గర నీటి బట్టిలో ద్విచక్ర వాహనంతో పడి హెల్త్ అసిస్టెంట్ సింగరాపు మోహన్ రావు (50) మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు కథనం ప్రకారం మండలంలోని గురువు నాయుడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మోహన్‌రావు హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రతిరోజు ఆయన స్వగ్రామమైన రామభద్రపురం నుంచి గురువు నాయుడుపేట విధులకు వెళ్లి వచ్చేవాడు. ఇటీవల మోహన్‌రావుకు ఆరోగ్యం బాగోలేక తన భార్య శస్యకుమారి తోడుగా ప్రతిరోజు గురువు నాయుడుపేటకు వచ్చేది. అయితే బుధవారం భార్య అనివార్య కారణాల వల్ల భర్తతోపాటు వెళ్లలేకపోయింది. యధావిధిగా డ్యూటీకి వెళ్లి బుధవారం సాయంత్రం తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనంతో పాటు మోహనరావు పాంచాలి సమీపంలో నీటిబట్టిలో పడి అక్కడక్కడ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య శస్య కుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు స్థానిక ఎస్సై వెంకట సురేష్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.



బట్టిలో పడిపోయిన మోహనరావు



రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వైశాలి

రైస్ మిల్లులను పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి సీతానగరం

మండలంలోని అప్పయ్యపేట సత్య మోడ్రన్ రైస్ మిల్లు, తామర కండిలోని వెంకట సూర్య రైస్ మిల్లును సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజీలు వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం రామవరం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జై ప్రశాంత్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

ఎపిఒ, డిడి, సూపరింటెండెంట్లపై విచారణ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎలో పనిచేస్తున్న ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, గత ట్రైబల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్‌లపై వచ్చిన ఆరోపణలపై ట్రైకార్ ఎండి మణికుమార్ గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా దళిత సంఘాల సమైక్య మండలి నాయకులు గణేష్, ప్రభాకర్, గోవింద్, రాంబాబు రాష్ట్ర కమిషనర్‌కు డిడి, ఎపిఒ, సూపరింటెండెంట్ అవకతవకలు చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారిగా మణికుమార్ నియమించారు. ఐటిడిఎ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో కిటికీలు, మెస్సలు అమర్చడంలో అవకతవకలు జరిగాయని, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, డెప్యూటేషన్లలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలతో ఫిర్యాదులో వచ్చాయని పేర్కొన్నారు. అదేవిధంగా డిడిపై ఏడు ఫిర్యాదులు, ఎపిఒపై 12 12 ఫిర్యాదులతో ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ ఆరోపణలతో పాటు ఆధారాలు కూడా పరిశీలిస్తామని అన్నారు. ఫిర్యాదుదారులు విచారణ రోజు హాజరు కాకపోతే కలవడానికి అవకాశం ఇస్తామని అన్నారు.



చెక్‌పోస్టును పరిశీలించిస్తున్న మనీషారెడ్డి

చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన ఎఎస్‌పి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలస వద్ద గల ఆంధ్రా- ఒడిస్సా సరిహద్దు చెక్‌పోస్టును పార్వతీపురం ఎఎస్‌పి వి.మనీషా రెడ్డి గురువారం పరిశీలించారు. సరిహద్దు చెక్పోస్ట్ వద్ద నిరంతరం పటిష్టమైన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఆంధ్రా -ఒడిస్సా నుండి వచ్చి పోయే వాహనాల రాకపోకలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనుమానితుల కదలికలను గమనిస్తూ ఉండాలని సూచించారు. అంతకుముందు పాచిపెంట పోలీస్ స్టేషన్ సందర్శించి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సాలూరు రూరల్, టౌన్ సిఐలు అప్పలనాయుడు, రామకృష్ణ, స్థానిక ఎస్సై వెంకట సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ మోసాలపై ఖాతాదారులు అప్రమత్తం అవసరమని ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్, ఎస్‌బిఐ మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. గురువారం కురుపాంలో మ్యాజిక్ షో, జానపద గీతాలు కూడిన కళాజాత ప్రదర్శన నిర్వహించారు. సైబర్ మోసాలతో ఖాతాదారులు మోసపోకుండా ఎలా ఉండాలన్న విషయంపై అవగాహన పరిచారు. అలాగే జనరల్ ఇన్సూరెన్స్ రోజుకు ఆరు రూపాయలు ఏడాది 2000 ఇన్సూరెన్స్ చేస్తే ప్రమాద భీమా రూ.40 లక్షలు బీమా వర్తిస్తుందని, దీంతో పాటు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా రూ.436, ప్రధానమంత్రి సురక్ష బీమా రూ.20, హాటల్ పింఛన్, రైతులు క్రాప్‌లోను, హౌసింగ్ లోన్, పిల్లల చదువులకు ఎస్‌బిఐ ఎడ్యుకేషన్లో, డ్వాక్రా సంఘాల్లోను, బ్యాంకు వివరాలు గూర్చి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమానికి మహిళలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పనసభద్రలో ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి - మక్కువ

దళారీల బారి నుండి రైతులను కాపాడేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని టిడిపి మండల అధ్యక్షులు జి.వేణుగోపాలనాయుడు అన్నారు. రైతన్న నీకోసం కార్యక్రమంలో భాగంగా పనసభద్రలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయశాఖ అధికారి సిహెచ్.భారతి ఆధ్వర్యంలో గురువారం ఆయన ప్రారంభించారు. రైతులకు మద్దతు ధర లభించేలా ప్రొక్యూర్ మెంటు ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేసి 24 గంటల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ కనబడతాయని తెలిపారు. తేమ లేకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఎఒ భారతి రైతులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక గ్రంథాలయాన్ని ఎంపిడిఒ ఐవి లక్ష్మి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠకులకు అందుబాటులో ఉన్న కథలు, నవలలు, వార్తాపత్రికలను పరిశీలించారు. విజ్ఞానాన్ని పెంపొందించే ప్రతి పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలని ఈ సందర్భంగా సూచించారు. రోజువారి పాఠకులు వచ్చేలా గ్రంథాలయాలను తీర్చిదిద్దాలన్నారు. అనంతరం గ్రంథాలయ రికార్డులను నిర్వహణ పరిశీలించారు. కార్యక్రమంలో లైబ్రరీయన్ సుకన్య ఉన్నారు .

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బిల్లకుర్తి నవీన్ ఇటీవల అమరావతిలో జరిగిన రాష్ట్ర కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. అధ్యాపకులు బౌరోతు శంకర్రావు నిరీక్షణ తదితరులు అభినందనలు తెలిపారు.

కరాటే పోటీలకు కురుపాం విద్యార్థులు

ప్రజాశక్తి -కురుపాం



విజేతలను అభినందిస్తున్న కరస్పాండెంట్, కోచ్

స్థానిక సరస్వతీ విద్యా నికేతన్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అంతర్ రాష్ట్ర స్థాయిలో మెరిసేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 30న విశాఖపట్నంలో జరగనున్న అంతర్ రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-10 విభాగంలో కె.సాత్విక్ (8వ తరగతి), కె.నిషిత (5వ తరగతి) పాల్గొననున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎన్.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కె.శ్రీరామమూర్తినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ ఈ పోటీలకు పాఠశాల కరాటే శిక్షకుడు, సెకెండ్ డాన్ బ్లాక్ బెల్ట్ కె.నరేష్ మెంటార్‌గా మార్గదర్శకత్వం వహించనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో అడుగుపెడుతున్న చిన్నారులు మంచి ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మన్మధరావు

ప్రజాశక్తి - సీతానగరం

డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరుగుతున్న ఆలిండియా సిఐటియు మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పిలుపునిచ్చారు. గురువారం సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమాల ఖిల్లా అయిన విశాఖపట్నంలో డిసెంబర్ 31 జనవరి 4 వరకు సిఐటియు జాతీయ మహాసభలు జరుగుతాయన్నారు. ఈ మహాసభలకు ప్రపంచ దేశాలతో పాటు దేశ వ్యాప్తంగా కార్మిక నేతలు హాజరుకానున్నారన్నారు. ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను చర్చించడం జరుగుతుందన్నారు.కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చడానికి పూనుకున్నాయన్నారు. 8 గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేయడం కార్మికులను దగా చేయడమేనని, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. మరోవైపు నిత్యవసర వస్తువులు పెట్రోల్, డీజిల్, గ్యాస్ మొదలైన ధర నిరంతరం పెంచుతూ విద్య, వైద్యం పూర్తిగా వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. మన్యం జిల్లాలో చెప్పుకుదగ్గ పరిశ్రమలు ల్లేవని, ఉన్న షుగర్, జ్యూట్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయని అన్నారు. దీంతో ఈ జిల్లా నుండి వేలాది మంది పొట్ట చేత పట్టుకుని వలసలుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిరంగా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని పోరాడుతున్న సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు. అంగన్వాడీ యూనియన్ జిల్లాకార్యదర్శి గంట జ్యోతి లక్ష్మి, నాయకులు వెన్నెల రామలక్ష్మి, ఎండిఎం జిల్లా కార్యదర్శి కార్యదర్శి వై.శాంతకుమారి, జె.గౌరి, సిల్లా పోలీస్, పి.తిరుపతి, ఎం.సత్యవతి, ఎం.సునీత,వి, లక్ష్మి, టి, రమేష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సంస్థాగత నిర్మాణ ప్రక్రియ

ఎఐసిసి పరిశీలకులు దేబాసిష్ పట్నాయక్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రానున్న రోజుల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్‌దే అధికారమని ఎఐసిసి పరిశీలకులు దేబాషిస్ పట్నాయక్ అన్నారు. గురువారం పార్వతీపురంలో ఎఐసిసి సభ్యులు జగత శ్రీనివాస్, డిసిసి బుల్లిబాబు, పార్వతీపురం నియోజకవర్గ ఇన్చార్జ్ బత్తిన మోహన్‌రావు, ఒబిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, ఆ పార్టీ నాయకులు తీళ్ల గౌరీశంకరరావు, కోలా కిరణ్ కుమార్, సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, చొక్కాపు వెంకటరమణ, శాంతి కుమారి తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో ప్రజలు బిఆర్ఎస్‌ను గెలిపించారన్నారు. కొన్నేళ్ల తర్వాత బిఆర్ఎస్ పనితనం తెలుసుకున్న ప్రజలు తిరిగి కాంగ్రెస్‌కే పట్టం కట్టారన్నారు. ఆంధ్రాలో కూడా అదే పరిస్థితి వస్తుందన్నారు. ఆంధ్ర, బీహార్ ఇలా ఎక్కడ చూసినా ఓట్ చోరీ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాలు ప్రకారం కాంగ్రెస్ బలోపేతానికి సంస్థత నిర్మాణ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షుడ్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో పార్టీ చాలా దృఢ సంకల్పంతో ఉందన్నారు. మన్యం జిల్లాలో జంఝావతి ప్రాజెక్టు సమస్య వేధిస్తోందని, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆ ప్రాజెక్టుకు మంచి రోజులు వచ్చాయని,తర్వాత ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందన్నారు. మళ్లీ కాంగ్రెస్ వస్తే ఈ ప్రాజెక్టుకు మోక్షం కలుగుతుందన్నారు. జిల్లాను ఏనుగుల సమస్య పీడిస్తోందన్నారు. ఇప్పటివరకు 12 మంది వ్యక్తులు చనిపోగా, సుమారు రూ.ఆరు కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. సుమారు ఐదేళ్లుగా ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు లేకపోవడం అన్యాయం అని, పూర్ణపాడు లాబేసు వంతెన పూర్తి కాలేదని, జిల్లాలో 90 శాతం చెరువులు, గెడ్డలు తదితర నీటి వనరులు కబ్జాకు గురయ్యాయని అన్నారు. పార్వతీపురం మున్సిపాలిటీని తాగునీటి సమస్య వేధిస్తోందన్నారు. డంపింగ్ యార్డ్ సమస్య దశాబ్దాలుగా వేధిస్తోందని, ఆయా సమస్యలన్నీ కాంగ్రెస్‌తో పరిష్కరింపబడతాయన్నారు. కార్యక్రమంలో జాత దిలీప్ కుమార్, గర్భాపు రవికుమార్, రాయల లక్ష్మ, చిట్టయ్య, రాంబాబు, బంకపల్లి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎఐసిసి పరిశీలకులు దేబాసిష్ పట్నాయక్

కర్రీ పాయింట్‌పై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దాడి

కలర్, టేస్టింగ్ సాల్ట్‌లతో వంట చేస్తున్నట్లు గుర్తింపు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ వన్ వే ట్రాఫిక్ రోడ్డు, చేబోలు వారి వీధిలో ఉండే ఆకుల వారి కర్రీ కేంద్రంపై ఆహార భద్రతా అధికారి వినోద్‌కుమార్ శుక్రవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను వినియోగిస్తున్నట్లు గుర్తించి హెచ్చరించారు. పట్టణ పరిధిలో కర్రీ కేంద్రాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. జాతీయ రహదారి, వన్ వే ట్రాఫిక్ రోడ్డులో పలు కేంద్రాలు ఉండగా, వాటిలో కొన్ని షాపుల యజమానులు ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. కనీస ఆహార భద్రత నియమాలు పాటించటం లేదన్న విమర్శలున్నాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న జిల్లా ఆహార పరిశీలన అధికారి గురు వారం ఉదయం సాలూరు వచ్చి ఆకుల వారి వాసవీ కేటరింగ్ అండ్ కర్రీ పాయింట్‌కు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంటకాల్లో వినియోగించ కూడని టేస్టింగ్ సాల్ట్ తో పాటు కొన్ని రకాల రంగులను గుర్తించారు. వాటిని ఎందుకు, వేటి కోసం వాడుతున్నారని కర్రీ పాయింట్ యజమాని పరమేశ్వర్రావును ప్రశ్నించగా, క్యాబేజీ పకోడి తయారీ కోసం వాడుతున్నట్లుగా యజమాని చెప్పారు. దీంతో ల్యాబ్‌కు పంపేందుకు పలు రంగుల శాంపిల్స్ సేకరించారు. అలాగే అక్కడే ఉన్న టేస్టింగ్ సాల్ట్‌ను నేల పార బోస్తూ, ఇకపై వాటిని వాడవద్దని హెచ్చరించారు. అనంతరం ఫుడ్ ఇన్సెక్టర్ విలేఖరులతో మాట్లాడారు. తాను జిల్లాకి వచ్చి రెండు నెలలు అయిందన్నారు. పట్టణంలో 14చోట్ల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించామన్నారు. వాటి ఫలితం వచ్చాక చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న పిఒ జగన్నాథ్

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-17, 19 రాష్ట్ర క్రీడల్లో ఐటిడిఎ విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో పిఒ స్వప్నల్ పవర్ జగన్నాథ్ గురువారం విద్యార్థినులను అభినందించారు. సీతంపేట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎస్.కావ్య, అండర్-14లో అథ్లెటిక్స్‌లో స్టేట్ సెకండ్ దక్కించుకున్నారు. వీరు డిసెంబర్ 1 నుంచి 4 వరకు మధ్యప్రదేశ్‌లో జరుగు జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలో క్రీడల్లో పాల్గొంటారు. సీతంపేట బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఎస్.సమిత ట్రిపుల్ జంప్‌లో స్టేట్ సెకండ్‌కు లభించింది. సిల్వర్ మెడల్ అందుకున్నారు. భామిని ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న ఎస్.కృష్ణవేణి, అండర్-19కు 100 మీటర్లలో స్టేట్ ఫస్ట్ రావడంతో గోల్డ్ మెడల్ అందుకున్నారు. జాతీయ స్థాయికి హర్యానాకు వెళ్లనున్నారు. వీరికి పిఒ అభినందించారు. విద్యార్థినిలతో పాటు హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్, పీడీ బి.శైలజ తదితరులు ఉన్నారు.

కలుపు నివారణతో మొక్కజొన్న దిగుబడులు

ప్రజాశక్తి - మక్కువ

మొక్కజొన్నలో కలుపు నివారణ చేపడితేనే దిగుబడులు సాధ్యమని ఐఐఎల్ మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని సాంతేశ్వరం ఆలయ సమీపంలో గురువారం మొక్క జొన్నలో కలుపు నివారణ అన్న అవగాహన సదస్సు ఇన్సెక్టిసైడ్ ఇండియా లిమిటెడ్, విజయ దుర్గ ట్రేడర్స్ సంయుక్తంగా నిర్వహించారు. ఐఐఎల్ మార్కెట్ మేనేజర్ ఎ.సత్యనారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో మెలుకువలు అలాగే కలుపు నివారణకు ట్రాక్టర్ బ్రాండ్ వారి కొత్త మందు నూతన విధానంతో టోరీ సూపర్ మందును వాడాలని రైతులకు సుచించారు. ఎస్‌పిఎఫ్ టెక్నాలజీ మార్కెట్లోకి తీసుకురావడం జరిగిందన్నారు. త్వరగా కలుపు నివారణ జరగడమే కాకుండా పంటకు రక్షణ కలిగిస్తుందన్నారు. మొక్కజొన్నలో అధిక దిగుబడులు సాధించాలంటే కలుపు నివారించాలని అన్నారు. కార్యక్రమంలో నార్త్ కోస్టల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ అప్పలరాజు, సేల్స్ ఎగ్జిక్యూటివ్ గోపీరాజు, ఎండిఇ, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ముస్తాబ్ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం భోజన పథకాన్ని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు వండిపెట్టాలన్నారు. విద్యార్థులకు హ్యాండ్ వాష్, పరిశుభ్రత తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణను పరిశీలించిన డిఐఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తివిద్య కోర్సుల్లో భాగంగా విద్యార్థులు జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రాం చేస్తుండగా గురువారం జిల్లా డిఐఇఒ వై.నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డిఐఇఒ మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. అధ్యాపకులు చెప్పింది ఆలకించి కోర్సుల్లో రాణించాలన్నారు. ఆయనతో పాటు ప్రిన్సిపల్ డిజిఎస్ వి.త్రినాధ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స.హ చట్టంపై నేడు అవగాహన

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమాచార హక్కు చట్టంపై ఉదయం 10 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఐవి లక్ష్మి తెలిపారు. సమాచార హక్కు చట్టం 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

మొరమలో రైతన్నా మీకోసం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లక్కగూడ పంచాయితీ మొరమలో ఎఎంసి ఛైర్మన్ కడ్రక కళావతి ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందించే వ్యవసాయ పనిముట్లు, పథకాలు, విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జి కె.భూషణ ఉన్నారు.

స్పోర్ట్స్ వింగ్‌లో ప్రవేశాలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో స్పోర్ట్స్ వింగ్ విభాగంలో బాలుర విద్యార్థులు చేరడానికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఎ పిఒ పవర్ స్వప్న జగన్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న జోనల్ లెవెల్ సెలక్షన్లు నిర్వహించబడుతుందని, గురుకుల ఆశ్రమ పాఠశాల నుంచి బాలురు విద్యార్థులు హాజరు కావచ్చన్నారు. ఆరో నుంచి 9వ తరగతి వరకు 30 సీట్లు చొప్పున సీతంపేట బాలుర గురుకుల పాఠశాలలో స్పోర్ట్స్ వింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

3లోగా దరఖాస్తులు సమర్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

సివిల్స్‌లో ప్రిలిమ్స్, మెయిన్ పరీక్షలకు సంబంధించి బిసి, ఎస్‌సి, ఎస్‌టి, నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఇ.అప్పన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అభ్యర్థులు విద్యా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు, 2ఫోటోలు దరఖాస్తుకు జతచేసి డిసెంబర్ 3లోగా దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఆర్‌సిఎం స్కూల్స్, రూం నెంబర్ 8, పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కు ఎదురు, పార్వతీపురం మన్యం జిల్లా వారికి సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8500187124, 9701786751, 9160801497 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'హెల్పింగ్ హ్యాండ్స్'

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా ప్రజలకు ప్రభుత్వా ఆసుపత్రుల్లో నిరాటంకమైన వైద్య సహాయం అందించేందుకు హెల్పింగ్ హ్యాండ్స్ అనే పేరుతో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కలెక్టర్ ప్రభాకరరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి గురువారం ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. జిల్లాలోని వైద్య అవసరాలను ప్రజల అందరికీ అందించేలా ఉండేందుకు ఇది ఒక సేవా దృక్పదమైన ఆలోచన. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి పూర్తి సహాయం అందించేందుకు, వారికి ఒపి తీసుకోవడం నుంచి వైద్యుని వద్దకు తీసుకువెళ్లడం, వైద్యులు సూచించిన ల్యాబ్ పరీక్షలు చేయించుకోవడానికి డయాగ్నోస్టిక్ సెంటర్ తీసుకెళ్లడం, అవసరమైన మందులు ఇప్పించడం, పూర్తిగా కొలుకోని ఇంటికి వెళ్లే వరకు పూర్తి బాధ్యత వహించడానికి ప్రతీ రోగికి ఒక వాలంటీర్ను సంపూర్ణ బాధ్యత వహించేలా ఈ వినూత్న కార్యక్రమానికి పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్ ఆలోచనా విధానం ఒక కొత్త వరవడి ఈ యొక్క కార్యక్రమాన్ని అంతా సద్వినియోగ పరచుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలంతా ఈ సేవను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మిల్లర్లు నిబంధనలు పాటించాలి : జెసి

ప్రజాశక్తి - గరుగుబిల్లి



రైస్‌మిల్లు రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ జగన్నాథ్

మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలని సంయుక్త కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశించారు. మండలంలోని పెద్దూరులో గల శ్రీ భారతి ఆగ్రో మిల్లును, రావుపల్లిలో రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. మిల్లులో జరుగుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. మిల్లుకు ధాన్యం తరలింపు, నిల్వ ఉంచిన ప్రాంతాలు, ధాన్యం నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. రైతుల నుంచి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడం, ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత రైతులకు చెల్లింపులు త్వరగా అందేలా చూడడం, మిల్లులో సరైన నిల్వ సౌకర్యాలు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో ఎలాంటి అవకతవకలకు తావు ఇవ్వరాదని, నిబంధనలు పాటించని మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని జెసి హెచ్చరించారు.

ప్రతి గింజా కొనుగోలు చేయాల్సిందే

పాలకొండ : రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేయాల్సిందేనని సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ అన్నారు. మండలంలోని సింగన్నవలసలోని రైస్‌మిల్‌ను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా గొట్టుమంగళపురంలో జరుగుతున్న గ్రామ కంఠ సోమిత్వ సర్వేను పరిశీలించారు. పంచాయతీ ఆస్తులను ఈ సర్వే ద్వారా గుర్తించాలన్నారు. అదేవిధంగా తమ్మినాయుడు స్కూల్ దగ్గర ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం పనులను పరిశీలించారు. భవనం పనులు పనులు వేగవంతంగా చేయాలన్నారు.

మృతి చెందిన అంగన్వాడీలకు
నష్టపరిహారం చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - మక్కువ



అంగన్‌వాడీ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

రాష్ట్రంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య, ఇతర కారణాలతో మృతి చెందుతున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్, మినీలకు రాష్ట్ర ప్రభుత్వం మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునేలా నష్టపరిహారం చెల్లించాలని, సిఐటియు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సాలూరు ప్రాజెక్టు పరిధిలోని తుండ పంచాయతీ పరిధి తాడివలస మినీ అంగన్వాడీలో పనిచేస్తున్న చోడిపల్లి కాంతమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు కాంతమ్మ స్వగ్రామమైన మక్కువ మండలం మార్కొండపుట్టి పంచాయతీ కోదుపెద్దవలసలో ఆమె కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా అంగన్వాడీ యూనియన్, సిఐటియు అంగన్వాడీల సమస్యలతో పాటు, ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో చనిపోతున్న అంగన్వాడీల కోసం రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసి నష్టపరహారం చెల్లించాలని యూనియన్ కోరుతుందన్నారు. విధుల్లో ఉంటూ మున్సిపాలిటీ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు చనిపోతున్నప్పుడు రూ.2లక్షల నుంచి రూ. 5లక్షల వరకు నష్టపరిహారం చెల్లిస్తున్నారని, ఐసిడిఎస్ లో కూడా అవే జీవోలను అమలు చేయాలని కోరారు. సర్వీస్ అంతా ప్రభుత్వం, ప్రజల కోసం సేవలందిస్తున్నప్పుడు, అంగన్వాడీలకు అకాల మరణం చెందితే వారి కుటుంబ సభ్యులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఉద్యోగం ఇచ్చేదానికి అవకాశం ఇవ్వాలని కోరారు. దహన సంస్కార ఖర్చుల కింద ప్రభుత్వం రూ.15వేలు చెల్లిస్తుందని, వెంటనే వారి కుటుంబ సభ్యులకు అందేలా అధికారులు కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో వందలాదిమంది అంగన్వాడీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని, వారందరికీ ఉచిత వైద్యం, బీమా, వైద్యానికి అయ్యే ఖర్చులు, రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని ప్రభుత్వమే అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విత్తన శుద్ధితోనే నాణ్యమైన పంటలు

ప్రజాశక్తి - కురుపాం

పంటల్లో తెగుళ్లు ఆశించకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులు సాధించాలంటే విత్తనశుద్ధి చేయాలని నైరా ఉద్యాన కళాశాల విద్యార్థులు సూచించారు. గురువారం కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ వరికోతలు తర్వాత మొక్కజొన్న సాగుచేసే రైతులు విత్తనశుద్ధి చేసుకుంటే మొక్కలకు చిన్నదశలో చీడపీడల నుంచి రక్షించుకోవడం జరుగుతుందన్నారు.

కేజీ విత్తనానికి 3 గ్రాములు మాంకోజెబ్తో శుద్ధి చేస్తే లేతదశలో తెగుళ్లు నుంచి కాపాడుకొని, మొలకశాతాన్ని పెంచవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు డి.శంకరరావు, తరుణ్, వంశీ, హజర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కంట్లో కారం చల్లి పుస్తెలతాడు చోరీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని పివిఆర్ పురం గ్రామానికి చెందిన రాగోలు అన్నపూర్ణమ్మ అనే మహిళ కంట్లో కారం కొట్టి మెడలో ఉన్న పుస్తెలతాడును గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు అపహరించిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పివిఆర్ పురం గ్రామానికి చెందిన అన్నపూర్ణమ్మ కుటుంబ సభ్యులు పొలం పనులు చేస్తుండగా భోజనాలు పట్టుకొని వెళ్లి వారికి ఇచ్చి తిరిగి ఇంటికి వస్తుండగా తన ముందు ఇద్దరు వ్యక్తులు ఫోన్లోమాట్లాడుతూ వెళ్తూ తిరిగి తనకు ఎదురుగా వచ్చి కంటిలో కారం కొట్టి మెడలో ఉన్న రెండు తులాల బంగారం పుస్తెలతాడు తెంచుకుపోయారు. అయితే ఆమె కేకలు వేస్తుండగా తిరిగి వారు వచ్చి ఆమె నోటిలో కూడా కారం చల్లి పరారయ్యారు. జరిగిన విషయం తెలుసుకొని కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. తరచూ దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.